సాక్షి బాపట్ల

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన

మంగళగిరి: సౌర విద్యుత్ వినియోగించడం ద్వారా బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని విద్యుత్ శాఖ ఏఈ మల్లికార్జునరావు తెలిపారు. ఆత్మకూరులో మంగళవారం సదస్సు జరిపారు.



ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

పొన్నూరు: మండలంలోని నండూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ దేవస్థానంలో తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కారు బోల్తా

కొల్లూరు: కొల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం కారు బోల్తా పడింది. రేపల్లె నుంచి తెనాలి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒకరికి గాయాలయ్యాయి.

న్యూస్‌రీల్

ఎస్సీ సంక్షేమ శాఖ గుంటూరు డీడీగా రాజా దిబోరా

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా రాజా దిబోరా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ డీడీగా పనిచేస్తున్న డి.మధుసూదనరావు 3 నెలలకు పైగా సెలవుపై వెళ్లడంతో ఇప్పటి వరకు ఏఓగా పనిచేస్తున్న మాణిక్యవరరావు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. తాజాగా ఆయన స్థానంలో బాపట్ల జిల్లా ఎస్సీ వెల్ఫేర్‌గా డీడీగా పనిచేస్తున్న రాజా దిబోరాకు గుంటూరు జిల్లా డీడీగా (పూర్తి అదనపు) బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వెబ్‌సైట్‌లో ఎస్‌ఏల సీనియార్టీ జాబితా

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేసేందుకు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లతో రూపొందించిన తాత్కాలిక సీనియార్టీ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉన్న పక్షంలో ఈ నెల 20వ తేదీలోపు గుంటూరు డీఈవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని తెలిపారు. మున్సిపల్ యాజమాన్యంలోని పాఠశాలల్లో ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులతో సీనియార్టీ జాబితాను ఇప్పటికే విడుదల చేశామని గుర్తుచేశారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడు




మాచర్లరూరల్: శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని గరుడు వాహనం పై ఊరేగించనున్నారు. మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి రాజగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఊరేగింపును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పల్నాటి ప్రజల ఇలవేల్పు శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. భక్తులు వేలాదిగా తరలివస్తారన్నారు. ఈఓ ఎం. పూర్ణచంద్రరావు, జేఏ వీరారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొమెర అనంతరాములు, బండ్ల బ్రహ్మం, గాజుల గణేష్, కోమటి వీరు, మద్దిగపు శ్రీనివాసరెడ్డి, సుంకె వాసు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్

కొరిటిపాడు(గుంటూరు): వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన వైఎస్సార్ సీపీ ముస్లింల పట్ల అంకిత భావం చాటుకుందని గుంటూరు మాజీ ఎమ్మెల్యే, మైనార్టీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు ఎస్.ఎం.జియావుద్దీన్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బిల్లు విషయంలో తెలుగుదేశం పార్టీ ద్వంద్వ విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. ముస్లింలకు మంచి చేసే సంస్థలను నీరుగార్చేలా కేంద్రంలోని బీజేపీ కూటమి కుయుక్తులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్ కల్యాణ్ ఎందుకు మౌనం వీడటం లేదని ప్రశ్నించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. ఇది 140.6684టీఎంసీలకు సమానం.

కన్నేశాడు...కబ్జా చేశాడు

- రామన్నపేటలో ప్రభుత్వ స్కూల్ భూమి ఆక్రమణ
- దొంగ సర్వే నెంబర్‌తో రిజిస్ట్రేషన్
- భూమి విలువ రూ.20 లక్షలు
- ఆక్రమణదారుడికి సహకరించిన రెవెన్యూ అధికారులు
- రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు
- అటు వైపు కన్నెత్తి చూడని ప్రభుత్వ అధికారులు

టాస్క్‌ఫోర్స్: కుక్క పిల్ల..సబ్బు బిళ్ల..అగ్గి పుల్ల కాదేది కవితకు అనర్హం అన్నాడు మహాకవి శ్రీశ్రీ. ఏ రకమైన భూమైనా ఆక్రమణకు అర్హమే అంటున్నారు కూటమి నేతలు. ఈ నేపథ్యంలో వారి చూపు ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఖాళీ స్థలంపై పడింది. అంతే అప్పటికప్పుడు దొంగ సర్వే నంబర్లు వేసి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా అమ్మకానికి పెట్టారు. భూమి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని స్థానికుల అంచనా. రెవెన్యూ అధికారులు కూడా ఆక్రమణదారుడికి అండగా నిలిచారు. ఆక్రమణదారుడు అధికార పార్టీ నేత కావడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.



కబ్జా చేసిన పాత స్కూల్ భవనం ప్రాంగణం స్థలం

110 ఏళ్ల నాటి పురాతన స్కూల్


వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పరిధిలోని కొత్తనగర్‌లో చీరాల–ఒంగోలు ప్రధాన రహదారి పక్కన నాలుగు సెంట్ల స్థలంలోని ఓ పెంకుటింటిలో స్కూల్ నిర్వహించే వారు. 1985 ఫిబ్రవరి 24న అప్పటి సమితి అధ్యక్షుడు ఉప్పల వెంకటేశ్వర్లు పెంకుటిల్లును తొలగించి నూతనంగా పక్కా భవనం నిర్మించారు. కొంతకాలం తరువాత స్కూల్‌కి వచ్చే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ప్రధాన రహదారి పక్కనే స్కూల్ భవనం ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. దీన్ని గమనించిన అప్పటి ప్రభుత్వం పాఠశాలను వేరే ప్రాంతంలో కొత్తగా భవనాలు నిర్మించి అక్కడికి తరలించారు. అప్పటి నుండి పాత స్కూల్ భవనం ఖాళీగా ఉండేది. కొంత కాలం ఈ స్కూల్ భవనాన్ని కమ్యూనిటీ హాలుగా గ్రామస్తులు వినియోగించుకున్నారు. ఆ తరువాత పశువైద్యశాలకు వినియోగిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆ స్కూల్ భవనంలోనే కొంత భాగంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతు భరోసా కేంద్రాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు.



పాత స్కూల్ భవనంపై ఉన్న శిలాఫలకం

స్థలంపై కూటమి నేత కన్ను

లక్షలు విలువ చేసే స్కూల్ భవనం ముందు ఉన్న ఖాళీ స్థలంపై పందిళ్లపల్లికి చెందిన కూటమి చోటా నాయకుడి కన్ను పడింది. వెంటనే కబ్జాకు పథకం రచించాడు. అతనికి రామన్నపేట కొత్తనగర్‌లో సర్వే నెంబర్ 347–1లో అసైన్డ్ భూమికి పట్టా ఉంది. అప్పట్లో ఈ అసైన్డ్ భూమిని స్థానికులు ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారు. వేటపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 344–2లో 60 సెంట్ల భూమి ఉంది, దానికి కొలతలు కొలిపించాలంటూ జనవరి 6వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ దాఖలు చేశాడు. జనవరి 24న సర్వేయరు ఆ భూమిని సర్వే చేశాడు. సర్వే సమయంలో సర్వేయరుకు వాల్యూం 87–1941లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు అర్జీదారుడు చూపించాడు. అతను చూపించిన డాక్యుమెంట్‌లోని అసైన్డ్ భూమి వేటపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 347–1లో ఉందని, అర్జీదారుడు కొలతల కోసం చూపించిన భూమి మాత్రం సర్వే నెంబరు 344–2లో ఉందని అర్జీదారుడికి సర్వేయరు ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. దీన్ని అడ్డు పెట్టుకొని 344–2లోగల పాత స్కూల్‌కి చెందిన ఒకటిన్న సెంట్ల భూమిని ఇంకొల్లు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మార్చి 24వ తేదీన రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.



అధికారులు ఇచ్చిన ఎండార్స్‌మెంట్ లెటరు

అమ్మకానికి పెట్టిన ఆక్రమిత భూమి

కబ్జా చేసిన భూమిని వెంటనే అమ్మకానికి పెట్టారు. పాత స్కూల్ ముందు గల ఖాళీ స్థలంలో ఉన్న పశువులను పరీక్షించేందుకు ఏర్పాటుచేసిన ఇనుప మెష్‌ను తొలగించారు. ప్రభుత్వ స్కూల్ భూమి ఆక్రమణకు గురవుతుందని స్థానికులు రెవెన్యూ, పంచాయతీ, వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పశు వైద్యశాలకు చెందిన పరికరాలు పీకి వేసినా దానిపై ఆ శాఖ సిబ్బంది కనీసం స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్కూల్ భూమి కబ్జాకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వే నంబర్లు వేరని ఎండార్స్‌మెంట్ ఇచ్చాం

పందిళ్లపల్లికి చెందిన వారు రామన్నపేట పాత స్కూలు ముందు స్థలం తమదని, దాన్ని సర్వే చేయాలని అర్జీ పెట్టారు. సర్వే సమయంలో వారు చూపిన డాక్యుమెంట్‌లు పరిశీలించాం. వారు కోరిన సర్వే నంబరు, వారు అర్జీలో రాసిన సర్వే నంబరు వేరుగా ఉన్నట్లు గుర్తించాం. అర్జీదారుడికి రెండు సర్వే నంబర్లు వేరని ఎండార్స్‌మెంట్ ఇచ్చాం.

–శ్రీనివాసరావు, మండల సర్వేయర్

చలివేంద్రానికి పోలీసు అనుమతి నిరాకరణ



బొమ్మల సెంటర్లో నిలిచిపోయిన చలివేంద్రం

పర్చూరు (చిన్నగంజాం): చలివేంద్రం ఏర్పాటు చేసేందుకు రోటరీ క్లబ్ చేసుకున్న విన్నపాన్ని పర్చూరు పోలీసులు తిరస్కరించారు. బొమ్మల సెంటర్లో చలివేంద్రం ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్న కారణంతో పోలీసులు అనుమతిని నిరాకరించినట్లు తెలిసింది. దీంతో పాదచారులు, ప్రయాణికులు ఎండ తీవ్రతకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చటానికి బొమ్మల సెంటర్లో చలివేంద్రం లేకపోవడంతో స్థానికులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు రోటరీ క్లబ్ గత 23 సంవత్సరాల నుండి ఈ ప్రాంతంలో నిస్వార్థ సేవలు అందిస్తుంది. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి దాతల సహకారంతో 45 రోజుల పాటు మజ్జిగను కూడా అందిస్తుంది. ఈ సంవత్సరం ఎండలు మండిపోతున్నా ఇంకా చలివేంద్రం మొదలు కాక పోవడంతో స్థానికులు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. పంచాయతీ వారు అనుమతిని మంజూరు చేసినా, పోలీసులు నిరాకరించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇన్ని సంవత్సరాల నుండి లేని ట్రాఫిక్ సమస్య ఇప్పుడే తలెత్తిందా అన్న ప్రశ్నను స్థానికులు లేవనెత్తుతున్నారు. పోలీసులు అనుమతి నిరాకరించడం వెనుక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో జోరుగా చర్చ సాగుతోంది. ఏదేమైనా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బొమ్మల సెంటర్లో చిన్నపాటి చలివేంద్రం ఏర్పాటుకైనా పోలీసులు అనుమతిని మంజూరు చేయాలని కోరుతున్నారు.

లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- గృహ నిర్మాణాలపై సమీక్ష

బాపట్ల: గృహ నిర్మాణాలలో లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. గృహ నిర్మాణాలపై ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు మంజూరు చేస్తున్న పక్కా గృహాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. లక్ష్య సాధనలో నిర్లిప్తంగా ఉండరాదన్నారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గృహ నిర్మాణాలలో చీరాల డివిజన్ పురోగతిలో లేకపోవడంపై సంబంధిత డీఈని ప్రశ్నించారు. గృహ నిర్మాణాలలో ప్రతివారం పురోగతి కనిపించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలలో చెరుకుపల్లి, కారంచేడు, చుండూరు, ఇంకొల్లు, పర్చూరు, వేటపాలెం మండలాలలో పురోగతి లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అధికారులు పద్ధతి మార్చుకొని పనిచేయాలని హెచ్చరించారు. అద్దంకి, చీరాల, చినగంజాం మండలాలలో గృహ నిర్మాణ పనులు జరగకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలలో గృహ నిర్మాణాలు, ధ్రువీకరణ పత్రాల జారీ, బిల్లుల చెల్లింపులు, తదితరమైన వాటిపై ప్రతి వారం లక్ష్యాలు నిర్దేశించుకుని ఆ మేరకు పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వర్లు, డీఈలు, ఏఇలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు చర్యలు

బాల్య వివాహాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను ఎవ్వరూ ప్రోత్సహించకూడదని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలను గమనిస్తే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు. జిల్లా యంత్రాంగం సరైన చర్యలు తీసుకుని వాటిని ఆపడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వటం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో డ్రాపౌట్స్‌ను గమనించి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలలోనూ విద్యార్థులకు బాల్య వివాహాలపై సదస్సులు ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలని అన్నారు.

15శాతం నిధులు అంగన్‌వాడీలకే కేటాయించాలి

మున్సిపాలిటీలు, మండల పరిషత్ బడ్జెట్లో 15శాతం నిధులను అంగన్‌వాడీ సెంటర్లకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆ నిధులు సెంటర్లకు కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం ఉపయోగిస్తారని అన్నారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోనే చదువుకునే విధంగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధామాధవి, ఎంపీడీవోలు, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు ఆభరణం బహూకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారికి లండన్‌లో స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందిన వి.సీతారామిరెడ్డి పేరుతో ఆయన కుటుంబసభ్యులు 30.500 మిల్లీ గ్రాముల బంగారు నక్లెస్‌ను బహూకరించారు. మంగళవారం శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి విచ్చేసిన వారు ఆలయ అధికారికి నక్లెస్‌ను అందజేశారు. అనంతరం దాత కుటుంబసభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి వేదపండితుల ఆశీర్వచనం అందజేశారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

పోలీస్ శాఖ ని‘శ్రేష్ట’ం

- బలహీనవర్గాలపై వివక్ష?
- ఆరునెలల్లో రెండు సార్లు సస్పెండైన ఎస్‌ఐ
- సీఐ ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్న ఎస్‌ఐపైనా వేటు
- అధికారపార్టీ సామాజికవర్గానికి రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి వంత
- జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన పోలీస్‌బాస్ తీరు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన పోలీస్ అధికారులకు ఒక న్యాయం..బలహీన వర్గ అధికారులకు మరో న్యాయం అన్న చందాన రేంజ్ అధికారి సర్వశ్రేష్ఠ త్రిపాఠి వ్యవహార శైలి ఉంది. దీనిపై జిల్లా పోలీసు శాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఇటీవల మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అరెస్టు చేసిన సమయంలో వేటు పడిన ఇద్దరు ఎస్‌ఐలూ బలహీనవర్గాలకు చెందినవారే. ఆ సమయంలో అక్కడే ఉన్న అధికార తెలుగుదేశం పార్టీ సామాజికవర్గ పోలీసు అధికారులు అక్కడే ఉన్నా.. వారిపై కనీస చర్యల్లేకపోవడంపై పోలీసుశాఖలో నిరసన వ్యక్తమవుతోంది.

ఆద్యంతం టీడీపీ సామాజికవర్గ అధికారుల కనుసన్నల్లోనే..

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను, ఆయన అనుచరులను మంగళగిరిలో అరెస్టు చేసి ముందుగా నగరంపాలెం పోలీస్ స్టేషన్ నుంచి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ సామాజిక వర్గానికి చెందిన ఎస్‌హెచ్‌ఓ వంశీధర్ వద్దకు తరలించారు. కోర్టులో హాజరు పరిచే ముందు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అదే సామాజిక వర్గానికి చెందిన స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆళ్ల హరిశ్రీనివాస్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో తీసుకెళ్లారు. ఆ తర్వాత కోర్టులో హాజరు పరిచే సమయంలో మాధవ్ తన అనుచరుల వద్ద ఫోన్ తీసుకుని తన లాయర్‌తో మాట్లాడుతుండగా సీఐ వీరాస్వామి దానిని లాక్కున్నారు. ఈ సమయంలో సీఐ వీరయ్యచౌదరి, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆళ్ల హరి శ్రీనివాస్ కూడా అక్కడే ఉన్నారు. వారు మాధవ్ ఫోన్‌లో మాట్లాడుతున్నా పట్టించుకోలేదు. సీఐ వీరాస్వామి ఫోన్ లాక్కున్నారు. అయితే మాధవ్ ఫోన్ మాట్లాడుతున్నా.. నిర్లక్ష్యంగా ఉన్నారన్న సాకుతో సీఐ వీరాస్వామితోపాటు పట్టాభిపురం ఎస్‌ఐ రాంబాబు, నగరంపాలెం ఎస్‌ఐ రామాంజనేయులుతో పాటు 12 మందిని రేంజ్ ఐజీ సస్పెండ్ చేశారు. వాస్తవానికి అరెస్టు సమయంలో నిందితుడు బంధుమిత్రులు, లాయర్‌తో ఫోన్ మాట్లాడే హక్కుంది. అతని వద్ద ఫోన్ లాక్కునే అధికారం పోలీసులకు లేదని సీనియర్ రిటైర్డ్ పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మాధవ్ ఫోన్ మాట్లాడుతున్నా.. చోద్యం చూసిన వారిని వదిలేసి ఫోన్ లాక్కున్న సీఐ వీరాస్వామిపై వేటు పడడం విస్తుగొలుపుతోంది. ఒక వేళ మాజీ ఎంపీ వ్యవహారంలో తప్పు జరిగినట్టు పోలీస్ బాస్ భావిస్తే మంగళగిరి నుంచి నల్లపాడు పోలీస్ స్టేషన్ వరకు ఎంత మంది పోలీసు అధికారులు ఉన్నారో అంత మందినీ సస్పెండ్ చేయాలి కానీ ఎస్సీ, బీసీలనే టార్గెట్‌గా చేసి సస్పెండ్ చేయడమేమిటని సిబ్బంది ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.

ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్నా వేటు

నగరంపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రామాంజనేయులు ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్నారు. కొద్దిరోజుల్లో సీఐ కానున్నారు. దీంతో ఆయన కూడా తన తప్పు లేకుండా సస్పెండ్ వేటు వేశారని మనస్తాపానికి గురైనట్టు తెలుస్తోంది.

ఆరునెలల్లో రెండోసారి సస్పెన్షన్

పట్టాభిపురం ఎస్‌ఐ రాంబాబు ఆరునెలల్లో రెండో సారి సస్పెండ్ అయ్యారు. దీంతో ఆయన తన తప్పు లేకున్నా వేటు వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. దీని వల్ల తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు దారుణంగా మారతాయని బాధ పడుతున్నట్టు తెలుస్తోంది.

వీరిపై చర్యలేవీ..

మాజీ ఎంపీ మాధవ్ సెల్‌ఫోన్ మాట్లాడిన వ్యవహారంలో 12 మందిని సస్పెండ్ చేసిన పోలీసుశాఖ ఇందులో భాగస్తులైన టీడీపీ సామాజికవర్గానికి చెందిన మంగళగిరి ఎస్‌ఐ వెంకట్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, నల్లపాడు సీఐ వంశీధర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆళ్ల హరి శ్రీనివాస్‌లపై ఎందుకు చర్యలు తీసుకోలేదని వెస్ట్ డీఎస్పీ ముందు సస్పెండ్ అయిన ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. బందోబస్తుకు వెళ్లి దూరంగా ఉన్న తమపై వేటు వేయడం ఏమిటని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గతంలో అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సస్పెండ్ అయి ఏఆర్ నుంచి సివిల్‌కు కనవర్షన్ అయిన బలహీనవర్గాల వారిని ఆరునెలలైనా ఇంతవరకు విధుల్లోకి తీసుకోలేదు. కానీ వీఆర్‌లోకి వెళ్లిన టీడీపీ సామాజిక వర్గానికి చెందిన సీఐకి మాత్రం తుళ్లూరు ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ వివక్ష ఎందుకో అధికారులే సమాధానం చెప్పాలి.

పునరావాసం కల్పించి ఇళ్లను కూల్చండి

- 40 ఏళ్ల నుంచి నివసిస్తున్నాం
- ఇళ్లను తొలగించడం అన్యాయం
- ఇన్నర్‌రింగ్‌రోడ్డు ఫేజ్ 3లో ఇళ్లు కోల్పోతున్న 200 కుటుంబాల ఆవేదన

గుంటూరురూరల్: ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్ 3 నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 41వ డివిజన్ స్వర్ణభారతినగర్‌లో సుమారు 200 ఇళ్లను అధికారులు ఎటువంటి సమాచారం లేకుండా తొలగిస్తున్నారు. దీంతో ఇళ్లు కోల్పోతున్న బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 ఏళ్ల నుంచి ఇక్కడ ఇళ్లు కట్టుకుని ఉంటున్నామని, కూలీనాలీ చేసుకుని బతుకుతున్నామని పేర్కొంటున్నారు. అధికారులు ఉన్నపళంగా ఇళ్లను కూలిస్తే ఏం చేయాలని కన్నీరుమున్నీరవుతున్నారు. తమకు పూర్తి పునరావాసం కల్పించి ఇళ్లను కూల్చాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఇళ్లను పొక్లెయిన్లతో కూల్చి వేస్తున్న క్రమంలో అడ్డుకున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం పునరావాసం కల్పించి న్యాయం చేయాలని కలెక్టర్, కమిషనర్, నగర మేయర్‌కు వినతిపత్రాలు అందించారు.



అధికారులు తొలగిస్తున్న ఇళ్లు

కూలి చేసుకుని బతికేవాళ్లం



గత ప్రభుత్వాలు ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకుని 40 ఏళ్లుగా కూలి చేసుకుని జీవిస్తున్నాం. ఇప్పుడు ఒక్కసారిగా వచ్చి ఇళ్లను కూల్చేస్తున్నారు. పునరావాసం కల్పించి ఇళ్లు కూల్చుకోవాలని చెబుతున్నాం. అయినా పట్టించుకోవడం లేదు. ఇల్లు కూల్చేశారు. ఇప్పుడు పిల్లలతో కట్టుబట్టలతో ఎక్కడికి వెళ్లాలి?

– జిల్లా సత్యవతి, స్థానికురాలు, బాధితురాలు

క్లుప్తంగా

జిల్లా ఫస్ట్ సాధించిన విద్యార్థినికి నగదు బహుమతి



చీరాలఅర్బన్: ఇంటర్మీడియట్ ఫలితాలలో చీరాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థిని కె.ధాత్రిశ్రీ బైపీసీలో 1000 మార్కులకు 975 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత తెలిపారు. జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా కె.ధాత్రిశ్రీకి జిల్లా కేంద్రం బాపట్లలో జరిగిన కార్యక్రమంలో బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చేతుల మీదగా రూ.10వేల నగదు ప్రశంసా పత్రాన్ని అందుకుందన్నారు. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

నేడు 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాలుర ఖోఖో జట్టు ఎంపిక

జె.పంగులూరు: 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ స్పోర్ట్స్ అథారిటి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో బాలుర ఖోఖో జట్టు ఎంపిక జరగనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కెపె పాల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికలో 18 సంవత్సరాలపై బాలురు, 10.01.2007 తరువాత పుట్టిన వారు మాత్రమే పాల్గొనాలని తెలియజేశారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులకు బీహార్ రాష్ట్రంలోని గయా పట్టణంలో మే 5 నుంచి 9 వరకు జరగబోవు ఖేలో ఇండియా పోటీలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలో రాష్ట్రం నలుమూలల నంచి క్రీడాకారులు హాజరౌతారని తెలిపారు. ఈ ఎంపికలో శాప్ ఛైర్మన్ ఏ రవినాయుడు, వీసీ ఎండీ గిరీష్ సహకారంతో జరుగుతుందని రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు.

వివేక్ ప్రపంచ రికార్డు సాధించడంపై హర్షం



బల్లికురవ: సంగీతంపై ఉన్న మమకారం, తండ్రి ప్రోత్సాహంతో మందా వివేక్ ప్రపంచ రికార్డు సాధించటం అభినందనీయమని వల్లాపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ మందా మోహన్‌రావు మంగళవారం కొనియాడారు. వల్లాపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వివేక్‌కు సంగీతమంటే ప్రాణం తండ్రి రమేష్ కీబోర్డు ప్లేయర్ కీబోర్డుపై వివేక్ గీతాలు ఆలపిస్తూ గతేడాది డిసెంబర్ 4 జరిగిన ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో పాల్గొన్నారు. కీబోర్డు వాయిస్తున్న కళాకారుల బృందం గంటలో 1046 వీడియోలు అప్‌లోడ్ చేశారు. హలీల్ మ్యూజిక్ స్కూల్ స్థాపన పాస్టర్ అగస్టీన్ చేతుల మీదుగా సోమవారం హైదరాబాద్‌లో మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు. బాల్యదశలోనే విద్యతో పాటు పట్టుదలతో సంగీతం నేర్చుకుని ప్రపంచ రికార్డుతో అరుదైన గౌరవం దక్కటం దేవునికృప అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

పునర్విభజనతో దక్షిణాదికి నష్టం ఖాయం

- పార్లమెంట్ నియోజవర్గాలను సీట్ల ప్రాతిపదికన విభజిస్తేనే న్యాయం
- జనాభా ప్రాతిపదికన సరికాదన్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

నరసరావుపేట: పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోయే పరిస్థితి ఉందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ఇప్పుడున్న సీట్ల నిష్పత్తి ఆధారంగా పెంచితే అన్ని రాష్ట్రాలకు న్యాయం జరుగుతుందన్నారు. 'పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన–ఫెడలరిజం' అనే అంశంపై మంగళవారం కోటప్పకొండ రోడ్డులోని విజ్ఞాన మందిరంలో నిర్వహించిన సెమినార్‌లో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. 2026లో జరిగే డీలిమిటేషన్‌తో జనాభా ఆధారంగా జరిగితే 543 సీట్లు 843 కు పెరుగుతాయన్నారు. దక్షణాది రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ జరిగిందన్నారు. ఉత్తరాది రాష్ట్రాలైన బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల వెనుకబాటుతనంతో జనాభా విపరీతంగా పెరిగిందన్నారు. దీని వలన అక్కడ సీట్లు పెరిగే అవకాశం బాగా ఉందన్నారు. యూపీలోని 80 సీట్లు 128 అవుతాయన్నారు. ఉమ్మడి ఏపీలోని 42 సీట్లు 48 సీట్లు మాత్రమే అవుతాయన్నారు. దీని వలన రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని తెలిపారు. దీంతో దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాల మధ్య సమతుల్యత లోపిస్తుందన్నారు. దీని వల్ల దేశ సమైక్యతకు భంగం వాటిల్లే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. అన్ని రాజకీయపార్టీలు దీనిపై చర్చించాలని కోరారు. ఏపీలోని కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. పౌరసమాజం చైతన్యవంతమై రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలని సూచించారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే జీవితం అంధకారమే

లాడ్జిలు, హోటల్స్, రిసార్ట్స్‌లో తనిఖీలు చేసిన పోలీసులు



లాడ్జిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: బెట్టింగ్‌లకు పాల్పడితే జీవితం అంధకారంగా మారుతుందని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని లాడ్జిలు, హోటల్స్, రిసార్ట్స్, దాబాలు, రెస్టారెంట్‌లలో మంగళవారం తనిఖీలు చేశారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో కొంతమంది స్వార్థపరులు వారి స్వలాభం కోసం యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగే అవకాశం ఉందన్నారు. అటువంటి వారు ప్రధానంగా లాడ్జిలు, హోటళ్లు, రిసార్ట్స్, రెస్టారెంట్లు, దాబాలను అడ్డాలుగా చేసుకొని వారి కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి వారి కార్యకలాపాలను కట్టడి చేసే ప్రధాన ఉద్దేశంతో తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించినా, ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు. హోటళ్లు, లాడ్జిలు, రిసార్ట్స్‌లో బస చేయడానికి వచ్చే వారి గుర్తింపు కార్డులను తనిఖీ చేసి వారి వివరాలను రికార్డులో నమోదు చేసుకోవాలన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు, ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించిన సమాచారం ఉంటే సంబంధిత పోలీసులకు, డయల్ 100, 112 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కత్తవ చెరువులో ఆక్రమణలు తొలగించాలి

- ప్రజాసంఘాల నాయకులు డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- శాఖల మధ్య సమన్వయలోపమే శాపం
- జిల్లా కలెక్టర్ జోక్యానికి నేతల వినతి



తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నేతలు

నరసరావుపేట: సత్తెనపల్లి రోడ్డులో అవుల సత్రం పక్కన ఉన్న 60 ఎకరాలకుపైగా విస్తీర్ణం కలిగిన కత్తవ చెరువు ఆక్రమణల చెరలో ఉంది. ఈ చెరువును పరిరక్షించాల్సింది ఎవరనే దానిపై మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య వాదన నడుస్తోంది. పట్టణానికి పశ్చిమం వైపు నుంచి ప్రవహించే మురుగునీరు ఈ చెరువుకు చేరి కిందికి వెళుతోంది. దగ్గరలోనే రైల్వే బ్రిడ్జి, రైల్వే లైను ఉన్నాయి. నిరంతరం రైల్వే అధికారులు, ఇరిగేషన్ అధికారులు ఈ చెరువును పర్యవేక్షిస్తూ ఉంటారు. ఇక్కడ ఆక్రమణల విషయం మున్సిపల్ అధికారులకు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్లానింగ్ ఆఫీసర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లను కలిసి ఆక్రమణలు తొలగించాలని వారు గతంలో కోరారు. ఆక్రమణలు తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా చర్యలు తీసుకునేందుకు అధికారులు ముందుకు రావట్లేదు. ఆక్రమణదారుల వైపు ఎంత బలముందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంపై పోరాడుతున్న ప్రజాసంఘాల నాయకులు తాజాగా మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యాలయ సూపరింటెండెంట్‌తోపాటు చిన్న నీటి పారుదల శాఖకు చెందిన డీఈ, ఏఈలకు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై వారు స్పందిస్తూ ఆక్రమణలు జరిగిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు. మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖలు కలిసి చర్యలు తీసుకోవాల్సి ఉందని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. గతంలో ఆర్డీవో సమావేశం నిర్వహించి ఆక్రమణలు తొలగించే ప్రయత్నం చేశారన్నారు. దీనిపై పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ.. రైల్వే లైను భద్రతతోపాటు పట్టణంలోని బరంపేట, గుంటూరు రోడ్డు ప్రాంతాలు ముంపు లేకుండా ఉండాలంటే కూడా ఈ చెరువును ఆక్రమణల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆయా శాఖలకు చెందిన అధికారులను సమన్వయపరిచి ఆక్రమణలు తొలగింపజేయాలన్నారు. రక్షణ కంచె ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోట నాయక్, ఆర్టీఐ కార్యకర్త వసంతరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



మృతి చెందిన అంజయ్య

జె.పంగులూరు: ట్రాక్టర్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ముప్పవరం కోటపాడు గ్రామాల మధ్య మంగళవారం రాత్రి జరిగింది. కోటపాడు గ్రామానికి చెందిన పూసపాటి శివశంకర్ ట్రాక్టర్ మొక్కజొన్న లోడ్కి వెళ్లి రాత్రి సమయంలో కోటపాడు వస్తుంది. అదే ట్రాక్టర్‌లో కోటపాడు గ్రామానికి చెందిన గొల్లమూడి అంజయ్య (50) ఉన్నాడు. అంజయ్య ట్రాక్టర్ ఇంజిన్పై కూర్చున్నట్లు తెలుస్తుంది. ట్రాక్టరు ముప్పవరం నుంచి కోటపాడు వచ్చే రూట్లో ఆదిరెడ్డి బావి దగ్గర మలుపు తిరుగుతుండగా, ట్రాక్టర్ అదుపు తప్పి ఒకసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్పై ఉన్న గొల్లమూడి అంజయ్య కింద పడిపోయాడు. కిందపడ్డ అంజయ్యపై ట్రాక్టర్ వెనుక చక్రం పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య వెంకాయమ్మ, కుమారులు మరియబాబు, వెంకటేష్ ఉన్నారు. అంజయ్య మృతి వార్త తెలియడంతో ఎస్సీ కాలనీ వాసులంతా సంఘటన స్థలానికి చేరుకున్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

రూ.8.52 లక్షలు అపరాధ రుసుము వసూలు



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు డీ–5 సెక్షన్, ఆర్టీసీ బస్టాండ్, పాత గుంటూరు, బాలాజీ నగర్, సుద్దపల్లి డొంక, ప్రగతినగర్‌లలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో 59 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, శ్రీనివాసబాబు మాట్లాడుతూ తక్కువ లోడ్‌కు సర్వీసు తీసుకొని అదనపు లోడు వాడుతున్న 140 సర్వీస్‌ల కింద రూ.4.83 లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఐదుగురికి రూ.2.19 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.లక్ష, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన రెండు సర్వీసులు గుర్తించి రూ.50 వేలు మొత్తం రూ.8.52 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహావసరాలకు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని, విద్యుత్ మీటర్లు తిరగకుండా చేస్తే అటువంటి వాటిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులకు 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు నేరుగా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చు అని వారు వెల్లడించారు. దాడుల్లో డీఈఈలు కె.రవికుమార్, ఎస్.మల్లిఖార్జున ప్రసాద్, పీహెచ్ హుస్సేన్‌ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్



నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

చీరాల: అక్రమంగా నాటుసారా విక్రయాలు సాగిస్తున్న చీరాల మండలం ఆదినారాయణపురంకు చెందిన వల్లాగి నాగరాజు అనే వ్యక్తిని మంగళవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, ఎస్సైలు, ఒన్‌టౌన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈపూరుపాలెం పంచాయతీ ఆదినారాయణపురానికి చెందిన వల్లాగి నాగరాజు అక్రమంగా సారా విక్రయాలు చేస్తుండడంతో అతడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఆరు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలానే చీరాల వైకుంఠపురం దండుబాట సమీపంలో జాలమ్మ గుడి వద్ద కావాటి నాగరాజు నాటుసారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఎనిమిది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ చట్టం ప్రకారం నాటుసారా కలిగి ఉండుట, అమ్ముట, రవాణా చేయడం నేరమని సీఐ నాగేశ్వరరావు అన్నారు. నాటుసారా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో 1,303 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 846 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,200, గరిష్ఠ ధర రూ.12,000, మోడల్ ధర రూ.11,700 పలికింది. కాయలు 457, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10.200, గరిష్ఠ ధర రూ.12,225, మోడల్ ధర రూ.11,700 పలికింది.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల స్వీకరణ

నరసరావుపేట ఈస్ట్: జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో మే నెల 1 నుంచి 31వ తేదీ వరకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు. పల్నాడు జిల్లా పరిధిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 50 శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. శిబిరంలో 8 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల 25 మంది చొప్పున బాలురు, బాలికలకు శిక్షణ ఇస్తామన్నారు. జిల్లా పరిధిలోని క్రీడా అసోసియేషన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు తాము శిక్షణ ఇవ్వనున్న క్రీడాంశం, ప్రదేశం పేర్కొంటూ పూర్తి వివరాలతో ఈ నెల 17వ తేదీలోగా స్టేడియంలోని కార్యాలయంలో అందజేయాలన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి



పి.నరసింహారెడ్డి, డీఎస్‌ఓ, పల్నాడు

పల్నాడు జిల్లా పరిధిలోని అర్హులైన క్రీడాకారులు నుంచి కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత పద్మ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2026వ సంవత్సరం గణతంత్ర దినోత్సవాల్లో అందించే పద్మ పురస్కారాల పరిశీలనకు దరఖాస్తులు పంపనున్నట్టు తెలిపారు. వివరాలను www. padmaawardr-gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. అర్హత గల క్రీడాకారులు తమ దరఖాస్తులను మే 26 వ తేదీలోగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ rportri na p@fmai.com, incentiver.-rchemer@fmai.com మెయిల్ అడ్రస్‌కు పంపాలని కోరారు.

'అభినవ గంధర్వ' ఆరాధ్యుల వెంకటేశ్వరరావు

- తండ్రి ఏవీ సుబ్బారావు కళావారసుడు
- పౌరాణిక పద్యనాటకానికి అంకితమైన కళాకారుడు
- నాలుగున్నర దశాబ్దాల్లో నాలుగువేలకు పైగా ప్రదర్శనలు
- వందలాది సత్కారాలు, బిరుదులు, గౌరవాలు
- కందుకూరి వీరేశలింగం రాష్ట్ర అవార్డుకు ఎంపిక



ఆరాధ్యుల వెంకటేశ్వరరావు

తెనాలి: కళారంగంలో విశిష్ట కృషిచేసిన నాటకరంగ ప్రముఖులకు రాష్ట్ర ప్రభుత్వం బహూకరించే కందుకూరి వీరేశలింగం రాష్ట్ర అవార్డుకు పట్టణానికి చెందిన ప్రముఖ పద్యనాటక కళాకారుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. కందుకూరి వీరేశలింగం జయంతి రోజైన బుధవారం సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసే అవార్డుల ప్రదానోత్సవంలో వెంకటేశ్వరరావును వీరేశలింగం అవార్డు, రూ.లక్ష నగదు, జ్ఞాపికతో సత్కరిస్తారు. ఈ సందర్భంగా కళారంగ ప్రముఖుడు వెంకటేశ్వరరావు పరిచయం. తన పద్యగానంతో పౌరాణిక నాటకరంగాన్ని ప్రకాశింపజేసిన ఆణిముత్యాల్లో తెనాలికి చెందిన 'అభినవ గంధర్వ' ఆరాధ్యుల వెంకటేశ్వరరావు ఒకరు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పాత్రలతో అర్ధ శతాబ్దంపాటు నాటక ప్రియులను అలరించిన 'గానకోకిల' ఏవీ సుబ్బారావు సుపుత్రుడు వెంకటేశ్వరరావు. డిగ్రీ చదివినా, తండ్రి కళా వారసత్వాన్ని అందుకున్నారు. ఏవీ సుబ్బారావు కళాప్రతిభతో ఒక వెలుగు వెలిగిన శ్రీపూర్ణశ్రీ నాట్య కళాసమితిని చేతబట్టి పద్యనాటకానికి అంకితమయ్యారు. తండ్రి తరహాలోనే శ్రీకృష్ణుడు పాత్రలో రాణించటమే కాకుండా వివిధ పౌరాణిక పాత్రల్లో తనదైన శైలితో వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. నాలుగున్నర దశాబ్దాల కాలంలో ఆంధ్ర రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోని తెలుగువారు సహా ఆయన పద్యగానంలోని మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించారు. 'గానకోకిల' ఏవీ సుబ్బారావు పెద్దకుమారుడు వెంకటేశ్వరరావు. సొంతూరు తెనాలి సమీపంలోని కొల్లూరు మండల గ్రామం అనంతవరం. తండ్రితోపాటు తెనాలిలోనే స్థిరపడ్డారు. తండ్రి స్ఫూర్తితో హైస్కూలులోనే తొలి వేషం గట్టిన ఈ కళాకారుడు. బీకాం చదువయ్యాక 1979లో పద్యనాటకాన్నే తన కెరీర్‌గా చేసుకున్నారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, అర్జునుడు, భవానీశంకరుడు, వేమారెడ్డి, నక్షత్రకుడు, బాలవర్ధి, చంద్రుడు పాత్రల్లో ప్రతిభను చాటారు. 2023 వరకు 4,371 ప్రదర్శనలు ఇచ్చిన ఘనతను సాధించారు. చింతామణి నాటకంలో ప్రేమ సన్నివేశం, శ్రీకృష్ణ రాయబారంలో పడకసీను, సెంటర్‌సీను, గయోపాఖ్యానం నాటకంలో యుద్ధసీను, చింతామణి పూర్తినాటకం, భవానీశంకరుడు ఏకపాత్ర ఆడియో రికార్డులుగా విడుదలయ్యాయి. గయోపాఖ్యానంలో యుద్ధసీను వీడియో రికార్డుగా వచ్చింది. పౌరాణిక పద్యనాటక కళాసేవకు గుర్తింపుగా 852పైగా సత్కారాలను, గౌరవాలను స్వీకరించారు. 2007–08 నంది నాటకోత్సవాల్లో ఉత్తమ నటుడు, ఉత్తమ సంగీతం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు నంది అవార్డులు, బిరుదులను అందుకున్నారు. 1995లో 'తానా' ఆహ్వానంపై ఉత్తర అమెరికాలో అనేకచోట్ల నాటక ప్రదర్శనలిచ్చారు. గాయనీమణి పి.సుశీల చేతులమీదుగా బంగారు కంకణం, నెల్లూరులో బంగారు కిరీటం, అక్కినేని నాగేశ్వరరావు చేతులమీదుగా కె.రఘురామయ్య అవార్డు మరచిపోలేని అనుభూతులుగా వెంకటేశ్వరరావు చెబుతారు. నాటకం ప్రదర్శిస్తుండగా ప్రేక్షకుల నుంచి కానుకల రూపంలో వచ్చిన రూ.4 లక్షలతో ఒక నిధి ఏర్పాటు చేసి నెలకు ఐదుగురు చొప్పున పేదకళాకారులకు రూ.500 వంతున ఆర్థికసాయం అందజేస్తూ దాతృత్వాన్ని చాటుతున్నారు. అధ్యాపకుడిగా పనిచేస్తున్న వీరి కుమారుడు నాగరాజు రంగస్థల నటుడిగా రాణిస్తున్నారు. ఏవీ సుబ్బారావు వర్థంతి రోజైన డిసెంబరు 16న వెంకటేశ్వరరావు, నాటకరంగంలోనే కొనసాగుతున్న ఆయన సోదరులు కోటేశ్వరరావు, ఆదినారాయణ ఏటా భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏవీ సుబ్బారావు పేరిట రాష్ట్రస్థాయి అవార్డును ప్రదానం చేయటమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా గల పలువురు కళాకారులను సత్కరిస్తున్నారు.



శ్రీకృష్ణుడు పాత్రలో...

1,47,684 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,68,585 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,47,684 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 75,504 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.